ఈనాం రైతులకు ఏదీ భరోసా?

- 'అన్నదాత సుఖీభవ' కోసం నిరీక్షణ
- పంట వేసి నెలన్నరవుతున్నా అందని పెట్టుబడి సాయం



కృష్ణాపురంలోని ఈనాం రైతులు

పద్మనాభం: ఈనాం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇంతవరకు అందించలేదు. దీంతో వరి పంటకు పెట్టుబడి పెట్టడానికి ఈనాం రైతులు ఇబ్బంది పడుతున్నారు. పంట వేసి నెలన్నర రోజులు దాటిపోతున్నా ఇంతవరకు పెట్టుబడి సాయం అందించకపోవడంతో నిరీక్షిస్తూనే ఉన్నారు.

అప్పులు తెచ్చి పెట్టుబడి

కృష్ణాపురం, పద్మనాభం, బీఆర్ తాళ్లవలస గ్రామాల్లో ఈనాం భూములు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 826 మంది రైతులు ఈ భూములను సాగు చేస్తున్నారు. వీరు జూలై ఆఖరి వారం, ఆగస్టు మొదటి వారాల్లో వరి పంట వేశారు. రైతులు పంట వేసి 45 రోజులు దాటిపోతోంది.



కృష్ణాపురంలో ఈనాం భూముల్లో వేసిన వరి పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

ఇంతవరకు ఎకరం విస్తీర్ణంలో సాగు చేయడానికి రైతులు రూ.15వేల వరకు పెట్టుబడి పెట్టారు. కొందరు రైతులు బ్యాంకుల్లో, మరికొంత మంది వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తెచ్చి, పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం వరి పంట చిరు పొట్ట దశలో ఉంది.


వైఎస్సార్‌సీపీ హయాంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈనాం రైతులకు రెండు విడతలుగా 7,500 రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించేది. మొదటి విడత నారు వేసే సమయంలో రూ.2వేలు, ఉబాలు వేసే సమయంలో రూ.5,500 పెట్టుబడి సాయం అందించేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు పంట వేయడానికి పెట్టుబడి సాయం అందించి రైతుకు వెన్నుదన్నుగా ఉండేది. ప్రస్తుతం పంట వేసి 45 రోజులు దాటిపోతున్నా అన్నదాత సుఖీభం పథకం కింద కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించక పోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు.

రైతులు చీడ పీడల నివారించేందుకు వరిపంటకు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. కూలీలతో కలుపు తీయిస్తున్నారు. మరో మూడు నెలల్లో పంట పక్వానికి వస్తుంది. పక్వానికి వచ్చినంత వరకు కలుపు తీయడానికి, యూరియా, పొటాష్ వంటి ఎరువులు వేయడానికి , సస్య రక్షణ చర్యలు చేపట్టడానికి ఎకరాకు రూ. 10వేలు పెట్టుబడి అవసరమవుతుంది. ఇప్పటికై కూటమి ప్రభుత్వం స్పందించి, తమకు పెట్టుబడి సాయం అందించాలని ఈనాం రైతులు కోరుతున్నారు.

ఈనాం రైతులు - సాగు విస్తీర్ణం

గ్రామం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
కృష్ణాపురం	600	406
బీఆర్ తాళ్లవలస	300	390
పద్మనాభం	50	30



పద్మనాభంలోని ఈనాం భూముల్లో వేసిన వరి పంట

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభంలోనే సాయం



నేను ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో వరి పంట వేశాను. జూలై నెలాఖరులో నాట్లు వేశాను. చిరు పొట్టదశలో ఉంది. ఇంతవరకు రూ.20 వేలు పెట్టుబడి పెట్టాను. పంట వేసి 45 రోజులవుతున్నా పెట్టుబడి సాయం అందలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందించేంది. ఆకులు వేసే సమయంలో, ఉబాలు వేసే సమయంలో ఈ మొత్తం డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమ చేసి ఆదుకునేవారు. ఇప్పుడు ఇంకా ఎదురు చూస్తూనే ఉన్నాం.

– ఎస్.నారాయణరావు, ఈనాం రైతు, కృష్ణాపురం

బ్యాంకులో అప్పు తెచ్చాను



నేను ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో వరి పంట వేశాను. ఆగస్టు మొదటి వారంలో నాట్లు వేశాను. అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టాను. బ్యాంకులో అప్పు తెచ్చి ఇప్పటికే రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టాను. పంట చేతికి రావడానికి మరో మూడు నెలలు పడుతుంది. ఇంకా పంటకు ఎరువులు వేయడానికి, చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టడానికి సుమారు రూ.18వేలు పెట్టుబడి అవసరమవుతుంది. ప్రభుత్వం తక్షణమే సాయం అందించి, ఆదుకోవాలి.

– ఎం.గురునాయుడు, ఈనాం రైతు, కృష్ణాపురం

క్లుప్తంగా

మద్యం దుకాణం ముట్టడి



సుభాష్‌నగర్‌లో మద్యం దుకాణాన్ని చుట్టుముట్టిన మహిళలు, స్థానికులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి సుభాష్‌నగర్ ప్రాంతంలో మద్యం దుకాణం వద్ద మహిళలు, స్థానికులు శనివారం ఆందోళనకు దిగారు. ఇక్కడ నివాసాల మధ్య మద్యం దుకాణం నిర్వహించడంతో నిత్యం మందుబాబులతో తలనొప్పిగా మారిందని, ఇటుగా వెళ్లిన మహిళలను వేధించడం, పెద్దగా కేకలు వేయడంతో నిత్యం ఆందోళనతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఇక్కడ మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ చుట్టుముట్టారు. పోలీసులు పట్టించుకోవడం లేదని, స్థానిక నాయకులకు చెప్పినా ప్రయోజనం లేదని అందుకే రాత్రి రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మద్యం దుకాణం కూటమి నాయకుడికి చెందినది కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా నివాసాల మధ్య ఉన్న ఈ మద్యం దుకాణాన్ని తరలించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

నేడు అవతార్ మెహర్ బాబా కేంద్రం వార్షికోత్సవం



పద్మనాభం: మండలంలోని రేవిడిలో అవతార్ మెహర్ బాబా కేంద్రం 17వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు అవతార్ మెహర్ బాబా చిత్రపటాన్ని వీధుల్లో ఊరేగించనున్నట్టు తెలియజేశారు. ఉదయం తొమ్మిది గంటలకు సప్తవర్ణ పతాకా విష్కరణ, 9.30 గంటల నుంచి కేంద్రంలో సంకీర్తనలు, సత్య, ప్రేమ సందేశాలు ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బాబాకు హారతి ఇవ్వనున్నట్టు తెలిపారు.

పవిత్రోత్సవాల కరపత్రిక ఆవిష్కరణ



ఆలయం వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ట్రస్టీ సభ్యులు, భక్తులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతినపేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం శ్రీవారి చతుర్థ తిరు పవిత్రోత్సవ కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. అక్టోబర్ 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ సభ్యులు కలిగొట్ల శ్రీరామ్, కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.తాతాజీ, ఆలయ అర్చకులు పురాణం శేషాచార్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్టీల్ కంచాల వితరణ



ప్రాథమిక పాఠశాలకు కంచాలు అందిస్తున్న శ్రీరామ్

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం నక్కల మామిడి ప్రాథమిక పాఠశాలకు 40 స్టీల్ కంచాలను శనివారం వితరణగా ఇచ్చారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు అనకాపల్లి పైడిరాజు వీటిని అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు గుర్ల గోవిందరావు, ఫౌండేషన్ సభ్యులు ఊడికల శ్రీను, రాంబాబు, లక్ష్మణరావు, మొకర శంకరరావు, కిశోర్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట



బాలాజీనగర్‌లో ఉత్సవ రాట వేస్తున్న ప్రసాద్

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలకు జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు బాలాజీనగర్‌లో శనివారం రాట వేశారు. వైఎస్సార్‌సీపీ ఒకటోవార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, జగుపల్లి విజయ్, గూడెల నాని, దొంతల పైడిరాజు, తమ్మిన శంకర్, గరే సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌లో 916 కేసుల పరిష్కారం



ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో మేజిస్ట్రేట్ సౌజన్య ఆధ్వర్యంలో జరుగుతున్న లోక్ అదాలత్



అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో లోక్‌అదాలత్‌లో పాల్గొన్న మేజిస్ట్రేట్ స్వాతిభవాని

భీమునిపట్నం: భీమిలిలోని మూడు కోర్టుల్లో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో 916 కేసులు పరిష్కారమయ్యాయి. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో మేజిస్ట్రేట్ డి.సౌజన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ పి.స్వాతి భవాని ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు కేసులు పరిష్కారమయ్యాయి. వాటిలో భీమిలి 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పరిధిలో 58 కేసుల్లో రాజీ చేసుకున్నారు. ఆనందపురం, భీమిలి పోలీస్ స్టేషన్‌లకు సంబంధించి 22 కేసుల వంతున, పద్మనాభం పోలీస్ స్టేషన్‌కు సంబంధించి 14 కేసులు ఉన్నాయి. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు ఎం.వి.పార్వతీశం, కె.ఎస్.ఎం.సుధాకర్, డి.ఈశ్వరరావు, వి.శంకరకుమార్ పాల్గొన్నారు.

జీవీఎంసీ కోర్టు ధిక్కారంపై 'కమిషన్' విచారణ

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు కుటుంబానికి చెందిన భవనం ప్రహరీ, పోర్టికో తొలగింపుపై హైకోర్టు కమిషన్ విచారణ చేసింది. రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఈ భవనం టీడీఆర్ ఇచ్చిన దానికంటే ఎక్కువ భాగం తొలగిస్తున్నారని, అలా తొలగించకుండా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో భవనం స్ట్రక్చర్‌కు ఎటువంటి నష్టం కలగకుండా రోడ్డు పనులు చేపట్టుకోవచ్చని గతంలో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయినా కోర్టు ఆదేశాలు ధిక్కరించి జీవీఎంసీ అధికారులు రోడ్డు నిర్మాణం కోసం తమ భవనం తొలగించారని భవన యజమానులు మరోసారి కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు అడ్వకేట్ కమిషన్‌ను నియమించింది. ఈ మేరకు శనివారం కమిషన్ సభ్యులు టి.ప్రవీణ్‌కుమార్ జీవీఎంసీ అధికారులు, భవన యజమానుల సమక్షంలో భవనం, రోడ్డు కొలతలు వేశారు. అయితే తాము నిబంధనల ప్రకారమే భవనం భాగాల తొలగింపు చర్యలు చేపట్టినట్టు డీసీపీ హరిదాసు చెప్పారు. దీనిపై పోతిన హనుమంతురావు మాట్లాడుతూ జీవీఎంసీ అధికారులు కక్ష కట్టినట్టు పోలీసు బలగాలతో తమ భవనానికి చెందిన ప్రహరీ, పోర్టికో కూలగొట్టడం సరికాదన్నారు. పైగా అభ్యంతరం చెప్పిన కుటుంబ సభ్యులను మహిళలు అని కూడా చూడకుండా పోలీసులు ఈడ్చి పడేసి, నిబంధనలకు విరుద్ధంగా భవనానికి నష్టం కలిగించారన్నారు. గతంలో కూడా రోడ్డు నిర్మాణ పనులకు సహకరిస్తామని తాము చెప్పినా, అధికారులు ఇంత రాద్ధాంతం చేశారన్నారు. విధిలేని పరిస్థితుల్లోనే తాము కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. తమకు కోర్టు ద్వారా పూర్తి న్యాయం జరుగుతుందనే విశ్వాసం ఉందన్నారు. కార్యక్రమంలో టీపీవో శ్రీలక్ష్మి, సర్వేయర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నేత ఇంటికి పాత మార్కింగ్ పక్కన మరో మార్కింగ్ చేస్తున్న జీవీఎంసీ అధికారులు, కోర్టు కమిషన్ సభ్యులు

నేషనల్ మూట్ కోర్టు పోటీలు ప్రారంభం

పీఎం పాలెం: జీవీఎంసీ 8వ వార్డులోని ఎన్‌పీపీ లా కళాశాలలో ఆళ్వార్‌దాస్ నేషనల్ మూట్ కోర్ట్ కాంపిటీషన్–25ను వైజాగ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమర్థవంతమైన న్యాయవాదిగా కొనసాగాలంటే ఆ వృత్తిలో ఉన్నవారు నిరంతర విద్యార్థిగా ఉండాలన్నారు. లా కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 14 రాష్ట్రాల నుంచి 30 లా కాలేజీల విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వి.రవీంద్ర ప్రసాద్, కరస్పాండెంట్ ఎస్.రవీంద్ర, లా కాలేజీ ప్రిన్సిపాల్ అలక్ చంద్రడు, లా విద్యార్థులు పాల్గొన్నారు.



మూట్ కోర్ట్ కాంపిటీషన్ లోగో ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు


బీచ్ రోడ్డు బస్సులకు ఆర్టీసీ కోత

- తగ్గిన 900కే సిటీ సర్వీసులు
- కానరాని స్టూడెంట్ స్పెషల్ బస్సులు

తగరపువలస: కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ప్రారంభించిన నాటి నుంచి బీచ్‌రోడ్డులో తిరిగే సిటీ బస్సులకు ఆర్టీసీ కోత విధించింది. భీమిలి నుంచి ఐఎన్‌ఎస్ కళింగ, చేపలుప్పాడ, మంగమారిపేట, తిమ్మాపురం, రుషికొండ, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లే 900కే సిటీ బస్సులలో రెండు వరకు తొలగించినట్టు ప్రయాణికులు, విద్యార్థులు తెలిపారు. గతంలో బస్సు పాస్‌లు ఉండే విద్యార్థుల కోసం తగరపువలస–భీమిలి మధ్య ఉదయం, సాయంత్రం వేళల్లో మూడేసి ట్రిప్పులు బస్సులు నడిచేవి. ఈ సర్వీస్ కూడా ఇటీవల కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు భారం

భీమిలి, తగరపువలస మధ్య ఉన్న బస్సులతో పాటు 900కే బస్సుల సంఖ్య తగ్గించడంతో ఇప్పుడు విద్యార్థులు తగరపువలస నుంచి ఆనందపురం, మధురవాడ మీదుగా ప్రయాణించి ఎండాడ చేరుకుంటున్నారు. బస్ పాస్‌లు ఉన్నా, మహిళలకు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నా ఎండాడ నుంచి బీచ్‌రోడ్డులో ఉండే గాయత్రీ పీజీ కళాశాల, గీతం వంటి విద్యాసంస్థలకు వెళ్లాలంటే ఆటోకు రెండువైపులా విద్యార్థులు రూ.40 ఖర్చు చేయవలసి వస్తోంది. అలాగే తగరపువలస–భీమిలి మధ్య కూడా ఆటోలకు రెండువైపులా రూ.40 చెల్లించవలసి వస్తోందన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు రోజుకు రూ.40 నుంచి రూ.80 భారం పడుతోంది. తగరపువలస–భీమిలి మధ్య స్టూడెంట్ స్పెషల్ బస్సులను పునరుద్ధరించడంతో పాటు బీచ్‌రోడ్డులో తగ్గించిన 900 కే సిటీ బస్సులను యథావిధిగా నడపాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.



900కే సిటీ బస్సు

మందుబాబులకు రూ.8.10 లక్షల జరిమానా

తగరపువలస: ఆనందపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి రూ.8,10,000 జరిమానా విధించారు. 81 మందిని శనివారం భీమిలి 15వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పి.స్వాతిభవాని ముందు ట్రాఫిక్ పోలీసులు ప్రవేశపెట్టగా, ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున జరిమానా విధించారు.

చిన్నారులకు బహుమతుల పంపిణీ



విజేతలతో ఉత్సవ కమిటీ

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు విల్సన్‌పేట నందీశ్వర యూత్ నిర్వహించిన గణేష్ ఉత్సవాలు శనివారం ముగిశాయి. 18 రోజుల పాటు మండపం వద్ద ప్రతిరోజూ చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి నిమజ్జనం సందర్భంగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో బింగి హరికిరణ్‌రెడ్డి, జీరు వెంకటరెడ్డి, అక్కరమాని చినబాబు, పందిరి విజయ్, అప్పలరాజు, శిరిగుడి వెంకటరావు, మోహనరావు, టొంపల సూరిబాబు, కొప్పల రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పందుల స్వైర విహారం



టీచర్స్ లే అవుట్‌లో నివాసాల సమీపంలో సంచరిస్తున్న పందులు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది టీచర్స్ లే అవుట్ 39వ వార్డు సచివాలయం పరిసర ప్రాంతాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా, నివాసాల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వీటి వలన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. పందుల కాపరులకు అధికారులు, జీవీఎంసీ సిబ్బంది అండగా నిలవడం వలనే ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని కోరారు.

నడిచే దారిలో టాయిలెట్ల వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ 1,2 వార్డులకు చెందిన సంతబయలు రహదారి జుగుప్సాకరంగా తయారైంది. ప్రైవేట్ మార్కెట్‌ను ఆనుకుని ఉన్న ఈ మార్గంలో ఇరువైపులా ఇళ్లలో చాలావరకు వ్యక్తిగత టాయిలెట్లు, ట్యాంకులు లేవు. దీంతో ఉదయం వేళ ఈ మార్గంలో డ్రైనేజీలు మురుగు వ్యర్థాలతో నిండిపోయి రహదారి మీదుగా ప్రవహిస్తున్నాయి. ఈ కారణంగా ఈ మార్గంలో నడవడానికి కూడా స్థానికులు సాహసించడం లేదు. జీవీఎంసీ శానిటేషన్ విభాగం జోక్యం చేసుకుని డ్రైనేజీలను శుభ్రం చేసి, ప్రతి ఇంటికీ వ్యక్తిగత టాయిలెట్లు, సెప్టిక్ ట్యాంకులు నిర్మించుకునేలా చేయాలని కోరుతున్నారు.

ఎయిడ్స్‌పై ప్రచార రథం ప్రారంభం



జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ప్రచార రథాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు శనివారం రేసవానిపాలెంలో ఉన్న కార్యాలయ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు జిల్లాలో ఈ ప్రచార రథం తిరుగుతుందన్నారు. ప్రజా సమూహాలు, మురికవాడల్లో ఈ రథం పర్యటిస్తుందన్నారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే ఇన్‌ఫెక్షన్లు, మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్ పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రోణంకి రమేష్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం మేనేజర్ ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్ భద్రి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డులో రూ.1.72 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కొమ్మాది జంక్షన్ వద్ద గల వైభవ్‌నగర్‌లో శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మధురవాడలో వెయ్యి కోట్లతో కీలకమైన సీవేజ్ ట్రీట్‌మెంట్, తాగునీటి ప్రాజెక్టులు రానున్నాయని తెలిపారు. పద్మనాభం, ఆనందపురం మండలాలను త్వరలోనే జీవీఎంసీలో విలీనం చేయనున్నట్లు చెప్పారు. భీమిలిలో ప్రధానమైన 3 రోడ్లను విస్తరించనున్నట్లు వివరించారు. వైభవ్ నగర్‌లో తాళాలు వేసి ఉన్న రెండు పార్కుల విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి, నిర్వహణను స్థానికులకు అప్పజెప్పాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు, కార్పొరేటర్లు మొల్లి హేమలత, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌ఎంఎంఎస్ ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు శనివారం వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. చదివిన విషయాలు గుర్తుంచుకోవడం, విద్యార్థుల ప్రవర్తన, వ్యక్తిగత క్రమశిక్షణ, సామూహిక చర్చ, క్రోడీకరించడం, విశ్లేషించడం, ఆటల ప్రాధాన్యం, సమయపాలన, అత్యుత్తమమైన వ్యక్తుల జీవిత చరిత్రలు చదవడం వంటి అంశాలపై గంట పాటు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 70 మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేక అప్పారావు, గౌరవ అధ్యక్షుడు జీవీ అప్పారావు, సలహాదారుడు సామంతుల ఎర్రయ్య, విషయ నిపుణులు పాల్గొన్నారు.



వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎంవీఆర్ రాజును సత్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

198 మందికి కంటి వైద్య పరీక్షలు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతినపేట వద్ద గల సన్‌స్కూల్‌లో భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, సన్‌స్కూల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 198 మంది రోగులకు శంకర్ ఫౌండేషన్ వైద్యులు డి.కృష్ణ దీపక్, తదితరులు పరీక్షలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ శిబిరానికి హాజరైన రోగుల్లో 34 మందికి కంటి అద్దాలు అవసరమని, త్వరలోనే అందిస్తామని చెప్పారు. 48 మందికి ఆపరేషన్లు చేయాల్సి ఉందని, త్వరలోనే ఆపరేషన్లు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎం.సూర్య శ్రీనివాసరావు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, కాళ్ల సన్నీ తదితరులు పాల్గొన్నారు.

దాకమర్రిలో 50 మందికి..

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలో శనివారం మధురవాడకు చెందిన నియోవిజన్ స్కిన్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 50 మందికి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణురాలు సురవి సేవల అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ ప్రధానకార్యదర్శి గెద్ద చిరంజీవి, చెల్లూరు రావణ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఆర్టీసీ డ్రైవర్లకు ప్రోత్సాహకాలు

మధురవాడ: ఆర్టీసీ ప్రయాణికులకు గౌరవంతో కూడిన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మధురవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఈఎస్‌కే దుర్గ అన్నారు. నేరుగా ప్రయాణికులతో మమేకమై, ఉత్తమ సేవలు అందించడంతో పాటు కేఎంపీఎల్ పెంచేందుకు కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. శనివారం మధ్యాహ్నం నిర్వహించిన కార్యక్రమంలో కేఎంపీఎల్ పెంచి సంస్థకు లాభం చేకూర్చిన డ్రైవర్లు ఇ.రమేష్, రమణలకు ప్రోత్సాహకాలు అందించారు. అందుబాటులో ఉన్న సిబ్బందితో పాటు సూపర్‌వైజర్‌లతో భోజన విరామ సమయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్‌కు ప్రోత్సాహకం అందిస్తున్న డిపో మేనేజర్ దుర్గ